# చేతికర్ర

## ఈతకోట సుబ్బారావు



అవును..అతను చాలా ఘాతుకం చేశాడు. వచ్చి మోసం... ప్రేమ నాటకం నడిపి తన హృదయంలో కోరికలనే ఆశల హరివిల్లు ను నిద్రలేపి నిప్పు రగిల్చాడు. ప్రేమ సాక్షిగా ఒట్టుపెట్టి రంగుల కలల సౌధం మీద అబద్ధపు ''తాజ్‌మహల్'' కట్టాడు.

ఎంత ప్రేమ..?!

అహ్..ఓ...ప్రేమ అనే భావన సముద్రం వలె లోతైనది...! తను యోగేష్‌ని ఎంతగా ప్రేమిస్తున్నది. కానీ ప్రేమ పేరుతో బలి చేశాడు. ఇంతగా అతణ్ణి ఆరాధిస్తున్నప్పటికీ తను యోగేష్ నిజ స్వరూపాన్ని తెలుసుకోలేక పోయింది. దెబ్బతగలక ముందే ఆ రాయిని ఆపలేకపోయింది. ఇప్పుడు దెబ్బ తగిలాక పశ్చాత్తప పడితే ఏం లాభముంది? ఈ దెబ్బ తన జీవితంలో ఆఖరిది మాత్రమే అవుతుంది. ఎందుకంటే ఇక ఇంతకంటే భరించలేని బాధ ఇంకొకటి ఉంటుందా?

అమ్మ మొదటి నుంచి చెబుతూనే ఉండేది. కానీ ఆమె మాటలను ఎప్పుడు లెక్క పెట్టింది గనక.. ? ఎప్పుడూ యోగేష్ రంగుల కలలలో ఊపిరి ఆడనంతగా ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉండేది. అతని మధురమైన నవ్వు మాయతో తన హృదయం మీద ఒక మాయ వల కమ్ముకుంది.

పక్షికి స్వాతంత్ర్యం అది బోనులో నుంచి బయటకు వచ్చినప్పుడు వస్తుంది. కానీ మధురమైన ఆ నవ్వుల మత్తులోంచి తను బయటకు వచ్చినప్పటికీ అస్వతంత్రురాలై ఆ జ్ఞాపకాల నీడలు నిస్సహాయంగానే తనను వెంటాడుతున్నాయి. అనూష ఏమీ చెయ్యలేక పోతోంది. ఎవరికీ చెప్పలేకపోతోంది.

ఇప్పటికి కూడా ప్రతిక్షణం అతని గురించిన ఆలోచనలే అనుక్షణం వెంటాడుతూనే ఉన్నాయి. తన ప్రతి ఆలోచనలోనూ, ప్రతి జ్ఞాపకం వెనకాల ఆ వ్యక్తి మోము మాత్రమే మొదటి జ్ఞాపకంగా మిగిలింది. ''ఒకవేళ యోగేష్ మాయలో ఇంతగా మునిగిందని అమ్మకు ముందే తెలిసినట్లయితే ఓ చక్కని పరిష్కారం చూపేదేమో..?'' అనూష హృదయం కల్లోల కడలిలా మదనపడుతోంది.

''అమ్మా....! మొదటి కలయికలోనే అతని గురించి ఆలోచించాను. అతను అందంగాడే కాదు, ఒక ప్రత్యేకమైన వ్యక్తి. నువ్వు ఒకటి రెండుసార్లు అతన్ని కలువు. అప్పుడు నువ్వే నిర్ణయిస్తావు తను నాకు సరిపోతాడా, లేదా అని...''

అమ్మకి బహుశా తన హృదయం గాయపరచడం ఇష్టం లేదనుకుంటా? ఆమె సైక్రియాట్రిస్టు అవడం చేత ఏమీ చెప్పలేక మౌనంగా ఉండిపోయింది.

ఇప్పుడు అమ్మకు ఎలా చెప్పగలదు? 'యోగేష్ బిడ్డకు తల్లి కాబోతోందని' యోగేష్ ఊరువదిలి వెళ్లిపోయాడు.

అనూష కళ్ల నిండా అంతులేని ధారలు..

యోగేష్ మాయలోపడి మొదటి నుంచి తన ప్రాణ మిత్రుల్ని కూడా పోగొట్టుకుంది. ఇప్పుడు ఈ దుఃఖాన్ని పంచుకోవడానికి ఎవరూ లేరు. కేవలం గుండెల నిండా ఆవేదనే. నీడ మాత్రమే తన తోడైంది.

అహ్..తను ఆ రోజు చెప్పలేదా...? 'నీ కోసం అమ్మ, నాన్నని, ఆస్తిపాస్తులను కూడా లెక్క చేయక అన్నీ వదలి నీ కోసం, కేవలం నీకోసమే వచ్చేస్తానని'. అతని మాటలతో ప్రేమ ఒక వెల్లువలా ప్రవహించింది. అమృత వర్షం కురిసినట్లయింది. నాకు నీ ఆస్తి మీద, సిరి సంపదల మీద అధికారం వద్దు. కేవలం నీ ప్రేమ మీద హక్కు కావాలి ఇవ్వగలవా అని...?

ఆ రోజు అతని నులువెచ్చని కౌగిలి వేడిలో నాకు అనిపించింది. కేవలం ప్రేమ మీద అధికారమే కాదు...తన ప్రాణం మీద అధికారం కూడా నాకే ఇవ్వగలడని... నేను ఏది అనుకున్నానో అదే నిజమయ్యేట్లుగా అన్నాడు....

''నా ప్రేమతో బాటుగా నా ప్రాణంపై కూడా అధికార ముద్రనీదే'' అని ..''నీకు నామీద పూర్తి అధికారం, స్వాతంత్ర్యం ఉంది'' అని

ఆ సమయంలో యోగేష్ మాటలతో అనూహ్య ప్రతి ప్రశ్నకు సమాధానం లభించింది.

ఆ తెలియని ప్రేమ మాయలో పడి ఆమె మురిసిపోయింది. ''ఈ ప్రపంచంలో తనకంటే గొప్ప అదృష్టవంతురాలు లేనేలేదని''

''నా సిరి,సంపద, ప్రాణం అన్నీ నువ్వే అనూషా... నువ్వే నా ప్రేమమూర్తివి.. నువ్వే నిజంగా స్వచ్ఛమైన మంచు శిల్పానివి''

కానీ ఆ మాట నిజమయ్యేలా ఆ సూర్యుని వేడి ఒక్కసారిగా ఆ మంచు శిల్పంపై ఆగ్రహంగా పడ్డవేళ ఆ మంచు కరిగి అసలైన అతని రాతి రూపం కన్పించింది.

ఒకరోజు యోగేష్‌తో -''మీ అమ్మా నాన్నలతో మన విషయం చెప్పడం చాలా అవసరం. ఇంకా ఆలస్యమైతే పరిస్థితి చావులా ఘోరమౌతుంది. ఎందుకంటే నేనుపెళ్లి కాకుండానే తల్లిని కాబోతున్నాను'' అది విని యోగేష్ సంతోషంతో ఎగిరి గంతేసి తనను అతని కౌగిలిలో బంధించి ఇంటికి తీసుకువెళతాడని అనుకుంది.


కానీ అనుకున్నది ఒకటి జరిగింది మరొకటి.

యోగేష్ ఆశ్చర్యపోలేదు...కౌగిలిలోకి తీసుకోలేదు. అతని కళ్లలో రక్తం బిందువుల వలె భయం స్పారీ చేస్తూ అనూష వైపు చూసి బిగ్గరగా నవ్వుతూ-''ఒకవేళ అమ్మా నాన్నలతో మన విషయం చెప్పడం అవసరమైతే నేను ఇంకా నూట పదకొండు మంది గురించి చెప్పి వాళ్లను కూడా ఇంటికి తీసుకెళ్లాలి. ఏం చెప్పమంటావా?''

అనూష నివ్వెర పోయింది. యోగేష్ అన్న మాటలతో ఇన్నాళ్లి ఆశల మేడ ఒక్కసారిగా కుప్పకూలిపోయి, అయోమయంగా వెనక్కి పరిగెత్తినట్టయ్యింది. తనువంతా ఒక్కసారిగా తడిసిపోతోంది. చెమటతో కాదు..కన్నీటి ధారలతో. అన్ని దారులూ ఒక్కసారిగా మూసుకుపోయి, దిక్కుతోచనట్లయింది. ఒకే ఒక దారి మాత్రం ఆ సమయంలో కచ్చితంగా కనిపిస్తోంది. అదే 'చావు'. చావు మాత్రమే రమ్మని పిలుస్తున్నట్లుగా ఉంది.

అనూష వేగంగా పరిగెడుతోంది. అలా అలుపెరుగని వేగంతో పరిగెడుతుండగా, దూరం నుంచి రైలు బండి కూత ఆమె చెవుల్లో మారుమ్రోగుతోంది. అది విని ఆమె కాళ్లకి సింహం వలె పరిగెత్తేంత శక్తి వచ్చినట్లయ్యింది.

అప్పుడు అనూష రైలు పట్టాలకి చాలా చాలా దగ్గరగా వచ్చింది. ఒక కుంటివాడు అప్పుడే చేతికర్ర పట్టుకుని ఎదురుగా దగ్గరలో రైలు పట్టాలు దాటు



తున్నాడు. కుంటివాడు కదా త్వరత్వరగా పట్టాలు దాటలేడు. దాటించమని ఆమె మనసు చెబుతోంది. అదే జరిగింది. పట్టాలు దాటే ప్రయత్నంలో ఆ కుంటివాని కర్ర విరిగిపోయింది. అతను కిందపడిపోయాడు. వెంటనే అతని వైపు పరిగెత్తింది. త్వరత్వరగా అతణ్ణి పైకి లేపుతూ దెబ్బతగల లేదు కదా? అంటూ భుజాన్ని నిమురుతూ అడిగింది.

''కాస్త జాగ్రత్తగా తమాయించుకోండి బాబా...''

ఆ కుంటివాని మోమున చిరుదరహాసం...అతను ఇలా అన్నాడు. ''చేతికర్ర అనేది పడిపోకుండా అడ్డుకోవడానికే బిడ్డా! కానీ విరిగిపోయిన తర్వాత కూడా తట్టుకుని నిలబడడమే జీవితం. శుభం'' అంటూ ముందుకు సాగిపోయాడు అవిటివాడు.

ఇంతలో ధనధన...శబ్దం చాలా దగ్గరికి వచ్చింది. కనురెప్పపాటు సమయంలో రైలు నుంచి పక్కకు తప్పుకుంది.

ఇప్పుడు ఆమె మనసులో ఒకే ఒక్కమాట మాటిమాటికి ప్రతిధ్వనిస్తోంది.

'విరిగిన తర్వాత కూడా తట్టుకుని నిలబడడమే జీవితం' అని .

అవును నిజం......

ఎందుకంటే నూట పదకొండు సార్లు మోసం చేసిన వాడికి కూడా తిరిగి బ్రతకడానికి హక్కున్నప్పుడు కేవలం ఒకే ఒకసారి మోసపోయిన తనకు జీవించే హక్కులేదా...?

విరిగినా తట్టుకొని జీవించగల ధైర్యాన్ని నేర్చుకుంటుంది తను. అవును ఇది ముమ్మాటికి అక్షర సత్యం.

*